సాక్షి అనకాపల్లి

గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



మాయా'జూదం'

8లో

యలమంచిలి మండలంలో గుండాటలు కొనసాగడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పోలీసులు చోద్యం చూస్తున్నారు.



ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: విశాఖలోని ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.



తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం

సీతంపేట: భక్తపహ్లాద తెలుగు టాకీ చిత్రం విడుదలైన సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ క్లబ్ ఆధ్వర్యంలో ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభమయింది.

న్యూస్‌రీల్

డీఆర్డీఏ పీడీగా శచీదేవి కొనసాగింపు

తుమ్మపాల: డీఆర్డీఏ పీడీగా ఉన్న కె.శచీదేవిని మరో ఏడాదిపాటు ఆ పదవిలో కొనసాగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లా డ్వామా ఏపీవోగా పనిచేస్తున్న ఆమెను డిప్యూటేషన్‌పై గత ఏడాది జనవరిలో జిల్లా డీఆర్డీఏ పీడీగా ప్రభుత్వం నియమించింది. ఇటీవల జరిగిన బదిలీల్లో డీఆర్డీఏ పీడీగా పోస్టింగ్ వచ్చిన డి.వి.విద్యాసాగర్ జాయిన్ కాకపోవడంతో పీడీగా ఆమె కొనసాగుతూ వచ్చారు. ఇప్పుడు విద్యాసాగర్ పోస్టింగ్ ఆర్డర్‌ను రద్దు చేసి, ఆమె మరో ఏడాది పాటు పీడీగా కొనసాగేలా తాజా ఉత్తర్వులు ఇచ్చారు.

దగాకోరు బడ్జెట్‌లో ఏపీకి మొండి చేయి

- బడ్జెట్ ప్రతులు దగ్ధం



దేవరాపల్లిలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న సీపీఎం నేతలు

దేవరాపల్లి: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మొండిచెయ్యి చూపించారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బిటి.దొర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవరాపల్లిలో బుధవారం భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించి, బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ, విభజన చట్టంలోని హామీలను పక్కన పెట్టి మోదీ సర్కారు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలను వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తించినప్పటికీ ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాలు కేంద్రాన్ని నిలదీయగా, రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఆర్భాటంగా ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రస్తావన లేదన్నారు. పార్టీ నేతలు మూలగుమ్మి ఎర్రినాయుడు, జె.ఈశ్వరరావు, ఎరుకులమ్మ పాల్గొన్నారు.

అనితమ్మా.. సిగ్గు.. సిగ్గు..

హోం మంత్రి సొంత జిల్లాలో అతివలకు రక్షణ కరువు



కూటమి పాలనలో.. కీచక పర్వం

- గత 8 నెలల్లో 20 పోక్సో కేసులు నమోదు
- రోలుగుంట జేసీ అగ్రహారంలో దివ్యాంగ బాలికపై లైంగిక దాడి
- రాంబిల్లిలో మైనర్ బాలికను హత్య చేసిన ప్రేమోన్మాది
- యలమంచిలిలో ముగ్గురు మైనర్ బాలికలపై అఘాయిత్యాలు
- అనకాపల్లిలో నిద్రిస్తున్న బాలికపై అత్యాచార యత్నం
- నర్సీపట్నంలో 9వ తరగతి విద్యార్థినికి యువకుడి వేధింపు

పసి పాపలు.. అభం శుభం తెలీని బాలికలు.. ప్రతిఘటించలేని దివ్యాంగులు.. ఎందరెందరో చిన్నారులను చిదిమేశారు. లైంగిక దాడితో తీరని గాయం చేశారు.. కొందరి ప్రాణాలు కూడా తీశారు.. జిల్లాలో మహిళలపై అత్యాచారాలు ఒక్కసారిగా పెరిగాయి. ముఖ్యంగా పోక్సో కేసులు ఎక్కువయ్యాయి. పట్టపగలు నడిరోడ్డుపై నడిచేందుకు కూడా జడవాల్సిన దుస్థితి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేటి వరకు జిల్లా వ్యాప్తంగా 20 పోక్సో కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దిశ పోలీస్ స్టేషన్లు మూసేశారు. దిశ యాప్‌కు మంగళం పాడారు. ఆఖరికి లైంగిక దాడుల కేసులను త్వరగా తేల్చడానికి ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ కోర్టును కూడా వద్దనుకున్నారు. అందుకే మానవ మృగాళ్లు రెచ్చిపోతున్నారు. పోలీసులకు సైతం కొరకరాని కొయ్యగా తయారయ్యారు. ఒక మహిళ హోం మంత్రిగా ఉన్న రాష్ట్రంలో ఆమె సొంత జిల్లాలో పరిస్థితి ఇంత దారుణంగా ఉందంటే ఇది ఆమెకే సిగ్గుచేటు.

సాక్షి, అనకాపల్లి:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి మహిళల భద్రతకు కరువైంది. ఒక మహిళా హోంమంత్రి సొంత జిల్లాలోనే బాలికలకు, మహిళలకు భద్రత లేకపోతే .. రాష్ట్రంలో అతివల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలకు ప్రశ్నార్థకంగా ఉంది. ప్రభుత్వ వైఫల్యంతోనే ఈ అఘాయిత్యాలు జరుగుతున్నాయంటూ మహిళా సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. ఇటీవల యలమంచిలి మండల పరిధిలో రెండు మూడు వారాల వ్యవధిలోనే ఇద్దరు మైనర్ బాలికలపై అఘాయిత్యాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా 20 పోక్సో కేసులు నమోదయ్యాయి. గత ప్రభుత్వంలో మహిళా భద్రతకు దిశ పోలీస్ స్టేషన్లను, దిశ యాప్‌ను, దిశ కాల్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను నిర్వహించారు. ఒక మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడాలన్నా.. అఘాయిత్యం చేయాలన్నా భయపడేలా ఉండేది. అంతేకాకుండా లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు, అఘాయిత్యాలకు పాల్పడే వారికి ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన శిక్షలు కూడా పడేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోక్సో కేసులు పెరిగాయి. వీటిలో రోలుగుంట మండలంలో జేసీ అగ్రహారంలో దివ్యాంగ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులోనే ముద్దాయికి శిక్ష పడింది. మిగతా అన్ని కేసులు దర్యాప్తులో ఉన్నాయి. యలమంచిలిలో 8వ తరగతి విద్యార్థినిపై స్వయాన బావే అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనకాపల్లి టౌన్‌లో తల్లిదండ్రులు లేకపోవడంతో అమ్మమ్మ ఇంటి దగ్గర ఉంటున్న ఆ బాలిక నిద్రిస్తున్న సమయంలో అత్యాచారానికి యత్నించారు. ఇలా ఒకటి కాదు జిల్లాలో 20 పోక్సో కేసులు నమోదయ్యాయి. మహిళలపై దాడులు, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడే మృగాలపై కఠిన శిక్షలు విధించాలంటూ మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అభం శుభం తెలియని పసిపాపలపై లైంగిక వేధింపులకు పాల్పడే మృగాలకు కఠిన శిక్షలు విధిస్తే మరొకరు చేయడానికి భయపడతారంటూ మహిళా సంఘాల నేతలు సూచిస్తున్నారు. వారిపై కఠిన చట్టాలు తీసుకొచ్చి శిక్షించాలి. లేదంటే వారు మరింత విజృంభిస్తారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మహిళల భద్రతపై ఫోకస్ పెట్టి దిశ యాప్‌ను, దిశ పోలీస్‌స్టేషన్లను మళ్లీ పునరుద్ధరించాలి.

భయపడకుండా ఫిర్యాదు చేయాలి..



గంజాయి, మద్యం లాంటి మత్తు పదార్థాలకు బానిసై బాలికలపై లైంగిక వేధింపులకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. భయపడకుండా తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేస్తేనే వారికి శిక్ష పడుతోంది. దీనిపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పోలీసులు అవగాహన కల్పించాలి. మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు పాల్పడితే వారికి పడే శిక్షలపై ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలి.

– కరణం కృష్ణ, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్, విశాఖ పోక్సో కోర్టు

విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు



జిల్లాలో ప్రతి పాఠశాల, కళాశాలల్లో సంకల్పం పేరిట విద్యార్థులకు నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే వేసే శిక్షల గురించి వివరిస్తున్నాం. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై కూడా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. నేరాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదు. జిల్లాలో ఈ ఏడాదిలో నమోదైన పోక్సో కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా చేస్తాం. మైనర్ బాలికలపై, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడితే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయండి. పోలీస్ స్టేషన్‌లో లేదా సచివాలయంలో ఉన్న మహిళ కానిస్టేబుల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. లేదంటే నేరుగా 100 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

– తుహిన్ సిన్హా, జిల్లా ఎస్పీ

జిల్లాలో గత ఏడాది జూన్ 4 తరువాత నుంచి నమోదైన పోక్సో కేసుల్లో ప్రధానమైనవి..

- జూలై 6: రోలుగుంట మండలం జేసీ అగ్రహారానికి చెందిన 16 ఏళ్ల దివ్యాంగురాలైన బాలికపై అదే ప్రాంతానికి చెందిన మోటార్ మెకానిక్ దాసు లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోక్సో కేసు నమోదు చేయగా.. కోర్టు దాసుకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది.
- జూలై 7: రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలో 14 ఏళ్ల మైనర్ బాలికను సురేష్ అనే యువకుడు ప్రేమోన్మాదం పేరిట అత్యాచారం చేసి హత్య చేశాడు. మరుసటిరోజు నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడు.
- అక్టోబర్ 15: యలమంచిలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైన్‌కొత్తూరులో గల న్యూలైఫ్ హాస్టల్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థినిపై హాస్టల్ కేర్‌టేకర్(వార్డెన్) రావాడ శ్రీను వేధింపులకు పాల్పడ్డాడు.
- అక్టోబర్ 19: అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో కుమారపురం గ్రామానికి చెందిన మైనర్ బాలికతో అదే గ్రామానికి చెందిన రెడ్డి అశోక్ అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు.
- అక్టోబర్ 22: యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 8వ తరగతి బాలికపై బావ అత్యాచారానికి పాల్పడ్డాడు.
- అక్టోబర్ 25: నర్సీపట్నం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 9వ తరగతి చదువుతున్న బాలికపై ఆర్.శివ అనే యువకుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.
- అక్టోబర్ 29: యలమంచిలి పట్టణం రామ్‌నగర్‌లో ఒక వివాహిత తనకు 18 ఏళ్లు నిండకుండా వివాహం చేశారని ఫిర్యాదు చేయగా భర్తపై పోక్సో కేసు పెట్టారు.
- అక్టోబర్ 30: అర్ధరాత్రి అనకాపల్లి గవరపాలెంలో సంతోషిమాత ఆలయ రహదారి సమీపంలో అమ్మమ్మ ఇంటి వద్ద నిద్రిస్తున్న 12 ఏళ్ల బాలికపై 65 ఏళ్ల యల్లపు శ్రీరామ్మూర్తి అత్యాచారం చేసేందుకు యత్నించాడు.
- జనవరి 28: యలయంచిలిలో 13 ఏళ్ల బాలికను హాకీ కోచ్ రూపేష్ అత్యాచారం చేశాడు. బాలికలకు కోచ్‌గా ఉంటూ హాకీ నేర్పిస్తామని లైంగిక దాడికి పాల్పడ్డాడు.
- జనవరి 11: ఏటికొప్పాకలో నాలుగేళ్ల చిన్నారిపై అఘాయిత్యం జరిగింది.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నిక

- ఎలక్షన్ కోడ్ కచ్చితంగా పాటించాలి
- నోడల్ అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమావేశం

తుమ్మపాల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి ఆమె పోలీసు, ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 27న జిల్లాలో 24 కేంద్రాల్లో పోలింగ్ జరుగుతుందని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించి వారికి శిక్షణ అందించాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలు చేయడానికి నియమించిన 27 బృందాలు, 24 ఫ్లయింగ్ స్క్వాడ్లకు చెందిన సిబ్బంది ఎక్కడా ఉల్లంఘనలు జరగకుండా చూడాలన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరిగితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఆర్వో సత్యనారాయణరావు, ముఖ్యప్రణాళిక అధికారి జి.రామారావు, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి బి.వి.రాణి, ఆర్డీవో మనోహర్, ప్రజా రవాణాశాఖ జిల్లా అధికారి, కె.పద్మావతి, డీపీవో ఆర్.శిరీషరాణి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.ఇంద్రావతి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

- దక్షిణమధ్య రైల్వే ఆర్పీఎఫ్ ఐజీ ఆరోమ సింగ్ ఠాకూర్
- అనకాపల్లి స్టేషన్ తనిఖీ



మాట్లాడుతున్న ఐజీ ఆరోమ సింగ్ ఠాకూర్

అనకాపల్లి: రైల్వేలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఆర్పీఎఫ్ సికింద్రాబాద్ ఐజీ ఆరోమ సింగ్ ఠాకూర్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా వివిధ రికార్డులను ఆమె పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ప్లాట్‌ఫారంపై అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సీసీ కెమెరాల సహాయంతో నేరగాళ్ల పనిపట్టాలన్నారు. జోన్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ మల్లేశ్వర్, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ మనోజ్ సింగ్ చౌహాన్, అనకాపల్లి రైల్వే స్టేషన్ సీఐ మధు, ఎస్ఐ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధితులకు మొబైల్ ఫోన్ల అప్పగింత

- 9వ విడతలో 503 ఫోన్ల రికవరీ



బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేసిన ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోయిన 503 మొబైల్‌ఫోన్లను రికవరీ చేసి ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం బాధితులకు అప్పగించారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇంతవరకు 4500 ఫిర్యాదులు నమోదు కాగా 9 విడతల్లో 2,711 మొబైల్ ఫోన్లను (విలువ సుమారు రూ.4 కోట్ల 7 లక్షలు) రికవరీ చేసి, ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన బాధితులకు అందజేశామన్నారు. మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయడంతో ఇది సాధ్యమైందన్నారు. సోషల్ మీడియా సీఐ కల్యాణి, ఐటీ కోర్ ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది బి.గోవిందరావు, పి.కృష్ణవేణి, జి.సాయికుమారిదేవి, ఎం.దేవకి, సీహెచ్.సునీత, డి.వి.రెడ్డిబాబు, సీసీఎస్ పోలీసులు ఎ.పరమేశ్వరరావు, ఎం.లక్ష్మీపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది వెంకన్న మెట్ల మార్గంలో గోవింద నామాలు

- బోర్డుల ఏర్పాటుకు రూ.లక్ష అందించిన ధర్మశ్రీ



ధర్మశ్రీ ఇచ్చిన లక్ష విరాళాన్ని అర్చకులకు అందిస్తున్న చైర్మన్ కన్నబాబు

బుచ్చెయ్యపేట: ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయ మెట్ల మార్గంలో గోవింద నామాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. గిరిజాంబ కొండపై కొలువైన వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ఎత్తయిన 140 మెట్లు ఉన్నాయి. ప్రతి మెట్టుకు గోవింద నామాలతో కూడిన పలకలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ లక్ష రూపాయలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబుకు విరాళంగా అందించారు. ధర్మశ్రీ అందించిన విరాళంతో మెట్ల మార్గంలో ప్రతి మెట్టుకు గోవింద నామాల బోర్డులు ఏర్పాటు చేయించాలని కన్నబాబు ఆలయ సిబ్బందికి సూచించారు. నెల రోజుల్లో ప్రారంభమయ్యే వేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలకు ముందే ఈ గోవింద నామాల బోర్డులు మెట్ల మార్గంలో ఏర్పాటు చేయాలని సూచిస్తూ లక్ష రూపాయలను ఈవో శర్మకు కన్నబాబు అందించారు.

నేడు మాజీ ఉపరాష్ట్రపతి రాక

మహారాణిపేట : భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హైదరాబాద్ నుంచి గురువారం ఉదయం 8.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి కిర్లంపూడి లేఅవుట్‌లోని ఇంద్రప్రస్థ అపార్టుమెంట్ లో బస చేస్తారు. 7వ తేదీన ఉదయం 10.20 గంటలకు ఏయూ కాన్వొకేషన్ సెంటర్‌లో జరిగే ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. 8వ తేదీన విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెంలో గురుదేవ చారిటబుల్ ట్రస్టు 26వ వార్షికోత్సవంలో పాల్గొంటారు.

మాయా'జూదం'.. భవిత ఛిద్రం

- జంపపాలెం సమీపంలో యథేచ్ఛగా గుండాటలు
- సర్వం ఒడ్డి నష్టపోతున్న జూదరులు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు
- మీడియాపై దాడికీ వెనకాడని గుండాట నిర్వాహకులు

యలమంచిలి రూరల్ : సంక్రాంతి సంబరాలు ముగిసినా యలమంచిలి మండలంలో కొన్ని ప్రాంతాల్లో గుండాటలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండలంలోని జంపపాలెం సమీపంలో పంట పొలాల్లో తరచూ గుండాట నిర్వహిస్తున్నారు. జూదం కారణంగా జేబులకు చిల్లు తప్పదని తెలిసినా..జూదం మాయలో పడి జనం రూ.వేలు, లక్షల్లో నష్టపోతున్నారు. రూరల్ పోలీసుల మద్దతుతోనే ఇక్కడ యథావిధిగా గుండాట నిర్వహణ సాధ్యమౌతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడ్రోజుల క్రితం జంపపాలెం సమీపంలో ఓ తీర్థం సందర్భంగా నిర్వహించిన గుండాటలో సమీపంలో ఓ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి గంట సమయంలో రూ.లక్ష ఓడిపోయాడు. మద్యం మత్తులో ఉన్న సదరు వ్యక్తిని గుండాట ఆడించి పెద్ద మొత్తంలో సొమ్ము కాజేశారు నిర్వాహకులు. కొందరు యువకులు అప్పులు తెచ్చి మరీ గుండాట ఆడి చిత్తవుతున్నారు. ఈ గుండాట నిర్వహణకు పెద్దన్న పాత్ర పోషిస్తున్న జంపపాలెంకు చెందిన ఒక వ్యక్తి మొత్తం వ్యవహారాన్ని నడిపిస్తున్నాడు.

పోలీసులొచ్చేసరికి పరార్

జంపపాలెం సమీపంలో తరచుగా గుండాట నిర్వహిస్తున్న సమాచారం అందుకున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ మంగళవారం అక్కడికి సిబ్బందిని పంపించారు. అయితే కిందిస్థాయి పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకున్న గుండాట నిర్వాహకులు పోలీసులు ఆ ప్రాంతానికి పంపించేసరికే అక్కడ్నుంచి పరారయ్యారు. ఈ ప్రాంతానికి చెందిన కొందరితో జిల్లాలో ఇతర ప్రాంతాలకు చెందిన మరికొందరు కలిపి మొత్తం 30 మంది వరకు జంపపాలెం సమీప ప్రాంతాలతో పాటు కొత్తకోట, మాకవరపాలెం, రాంబిల్లి మండలాల్లో కూడా గుండాట నిర్వహిస్తున్నారు. వీరంతా ఓ మాఫియాలా మారి గుండాట నిర్వహిస్తున్న ప్రాంతానికి వెళ్తున్న మీడియా ప్రతినిధులపై దుర్భాషలాడడం, దాడులకు తెగబడడం చేస్తూ బరి తెగిస్తున్నారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి రామారాయుడుపాలెంలో మంగళవారం ఆంజనేయస్వామి తీర్థం జరిగింది. అక్కడ ఎలాంటి జూద క్రీడలు నిర్వహించకుండా ఇద్దరు పోలీసు సిబ్బందిని కాపలా ఉంచారు. అయితే కాపలా ఉన్న పోలీసు సిబ్బందే గుండాట నిర్వాహకులకు మాకెంతో కొంత ఇచ్చి గుండాట నిర్వహించుకోమని భరోసా ఇచ్చేశారు. ఇటీవల జంపపాలెం సమీపంలో గుండాట నిర్వహించిన సమాచారం గురించి యలమంచిలి పోలీస్‌స్టేషన్ అధికారికి మీడియా ప్రతినిధి సమాచారం తెలియజేస్తే సమాచారమిచ్చిన ఆ మీడియా ప్రతినిధి పేరుతో సహా మొత్తం విషయం క్షణాల్లో గుండాట నిర్వాహకులకు చేరిపోయింది. గుండాట నిర్వహిస్తున్న కొందరిపై జిల్లాలో కొన్ని పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. అలాంటి వారి జాబితాతో ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా ఆరా తీస్తే గుండాట మాఫియా వ్యవహారంలో వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

సమాచారమిస్తే చర్యలు తీసుకుంటాం : డీఎస్పీ

గుండాట గానీ ఏ విధమైన జూద క్రీడలు గానీ నిర్వహిస్తున్నట్టు సమాచారమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పరవాడ డీఎస్పీ వి విష్ణుస్వరూప్ స్పష్టం చేశారు. ఇలాంటి వ్యవహారాలపై ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదన్నారు. మంగళవారం మా సిబ్బందిని జంపపాలెం ప్రాంతానికి పంపించాం కానీ ఎవరూ పట్టుబడలేదని తెలిపారు. ఇకపై గట్టి నిఘా ఉంటుందన్నారు.



జంపపాలెం సమీపంలో పొలాల్లో గుండాట నిర్వహిస్తున్న దృశ్యం

మీడియాకు బెదిరింపులు

మంగళవారం జంపపాలెం సమీపంలో పొలాల్లో గుండాట నిర్వహిస్తున్న సమాచారం అందుకున్న కొంతమంది మీడియా ప్రతినిధులు ఆ ప్రాంతానికి వెళ్లినపుడు సదరు గుండాట నిర్వాహకుడు దురుసుగా ప్రవర్తించాడు. నేను చాలా ఏళ్లుగా జూదం నిర్వహిస్తున్నాను నన్ను మీరేం చేస్తారు? పోలీసులు పట్టుకున్నా రూ.500 జరిమానా కట్టి వచ్చేస్తానంటూ దుర్భాషలాడాడు. అంతటితో ఆగకుండా అక్కడకు వెళ్లిన మీడియా ప్రతినిధులకు వీడియో తీసి మీకు లంచాలు కావాలా అంటూ తిరిగి బ్లాక్‌మెయిల్ చేసే స్థాయికి వచ్చాడు.మళ్లీ ఈ ప్రాంతానికి వస్తే మీ ప్రాణాలు తీస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు.

వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

చోడవరం రూరల్ : పదో తరగతిలో చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిందిగా ఉపాధ్యాయులకు అనకాపల్లి జిల్లా విద్యాధికారి గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని దుడ్డుపాలెం, గవరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పర్యటనలో భాగంగా ఆయా పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు.

పరీక్షల భయాన్ని దరి చేరకుండా ఉంచడానికి వారికి పలు సూచనలు ఇచ్చారు. వంద రోజుల అభ్యసన ప్రణాళిక అమలు తీరుతెన్నులను గమనించారు. ఇటీవల నిర్వహించిన ఫార్మటివ్-3 పరీక్ష ఫలితాల ఆధారంగా మార్కుల సాధనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు తెలిపారు. గత విద్యా సంవత్సరంలో తెలుగు మీడియంలో జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచిన గవరవరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు. ఇటీవల నిర్వహించిన ఆటల పోటీలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఆయన వెంట జిల్లా ఏపీవో వెంకటేశ్వరరావు, మండల విద్యాధికారులు తిరుపతిరావు, సింహాచలం, సీఆర్ఎంటీ కె.వి.మహాలక్ష్మినాయుడు ఉన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శోభారాణి(దుడ్డుపాలెం) జి.జె. సుందర్ సింగ్ పాల్గొన్నారు.

ఎంఆర్‌సీ కార్యాలయం సందర్శన

స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయాన్ని అనకాపల్లి జిల్లా విద్యాధికారి గిడ్డి అప్పారావు నాయుడు బుధవారం సందర్శించారు. కార్యాలయంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులతో కలసి సమీక్షించారు. క్లస్టర్ల పునర్నిర్మాణం అనంతర పరిస్థితులను ఆయా స్కూల్ కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- జెడ్పీ సీఈవో నారాయణమూర్తి వెల్లడి



మండల స్థాయి అధికారులతో మాట్లాడుతున్న సీఈవో నారాయణమూర్తి

గొలుగొండ: వేసవిలో జిల్లా వ్యాప్తంగా ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఆయన మండలంలో లింగంపేట, ఏటిగైరంపేట ప్రాంతాల్లో ఉన్న భారీ మంచినీటి పథకాలకు పరిశీలించారు. మండలంలో 29 గ్రామ పంచాయతీలకు తాగునీరు అందించే పథకాలు పనితీరును అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. నాలుగు గ్రామ పంచాయతీలకు తాగునీరు సరిగా అందలేదని దీనికి రూ.పది లక్షల వరకు ఖర్చు అవుతుందని మండల స్థాయి అధికారులు తెలిపారు. వాటి మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్టు సీఈవో తెలిపారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి గడిచిన రెండేళ్లలో జరిగిన పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మండల పరిషత్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఉందని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున సిబ్బంది కొరత లేకుండా కోడ్ ముగిసిన 15 రోజుల్లో చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రతి వారం రెండు మండలాల్లో పర్యటన చేసి అక్కడ సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని దీంట్లో భాగంగానే ఈరోజు ఇక్కడికి రావడం జరిగిందన్నారు. జిల్లాలో 45 భారీ మంచినీటి పథకాలు ఉన్నాయని , వాటికి ప్రతి ఏటా రూ. 10కోట్లు వరకు నిర్వహణ ఖర్చు జరుగుతుందని వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరి రోజ్, ఎంఈవో ఏవీఎస్ఎస్ మూర్తి, వ్యవసాయశాఖ అధికారి సుధారాణి పాల్గొన్నారు.

డిశ్చార్జ్ అయిన ఫార్మా బాధితులు

- అందరూ క్షేమం



క్షతగాత్రులను పరామర్శిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం

నక్కపల్లి/అనకాపల్లి టౌన్: హెటిరో కంపెనీలో మంగళవారం విషవాయువులు పీల్చడం వల్ల అస్వస్థతకు గురైన కార్మికులు చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. కంపెనీలో యూనిట్ 9లో హెచ్ 7 బ్లాక్ వద్ద సోడియం హైపోక్లోరైడ్ ట్యాంకు శుభ్రం చేసే సమయంలో అడుగు భాగంలో ఉండే వాల్వ్‌ను తెరవడంతో ట్యాంకులో ఉన్న హైపోక్లోరైడ్ డ్రైన్‌లోని హైడ్రో క్లోరిక్ యాసిడ్‌తో కలిసి క్లోరిన్ గ్యాస్ జనరేట్ అయింది. ఇదే సమయంలో అటువైపుగా వెళ్తున్న కార్మికులు పీల్చడం వల్ల అస్వస్థతకు గురయ్యారు. వెంటనే యాజమాన్యం కార్మికులను నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తొమ్మిది మందిని, విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి ముగ్గురిని తరలించి అత్యవసర చికిత్స అందించింది. దీంతో కార్మికులంతా పూర్తిగా కోలుకుని బుధవారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ ఘటనపై విజయనగరం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కూడా విచారణ నిర్వహించారు. ఇటువంటి ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, భద్రతా ప్రమాణాలు పాటించాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ ప్రమాదానికి కారణాలపై పూర్తి స్థాయి విచారణ జరిపిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రమాదాల కట్టడిలో కూటమి సర్కారు విఫలం

హెటిరో కంపెనీలో విషవాయువులు లీకైన ఘటనలో అస్వస్థతకు గురైన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం కోరారు. విశాఖపట్నం కేర్ హాస్పటల్లో క్షతగ్రాతులు కట్టా వీరబాబు, జి.సుబ్రమణ్యం, గౌరీనాయుడులను బుధవారం ఆయన పరామర్శించారు. ఫార్మా పరిశ్రమలలో వరసగా ప్రమాదాలు జరుగుతున్నా, వాటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు.

ఏడాదిగా జీతం అందలేదు

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఆవేదన
- కార్యాలయం వద్ద బైఠాయింపు



మాట్లాడుతున్న సీనియర్ అసిస్టెంట్ సుందరం

మాడుగుల: తనకు ఏడాదిగా జీతం అందలేదని, జీతం రాకపోవడానికి తమ సబ్ రిజిస్ట్రార్ పురుషోత్తం కారణమని బుధవారం కార్యాలయం ముందు తన తన భార్య లక్ష్మితో కలిసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేసే సీనియర్ అసిస్టెంట్ సుందరం బైఠాయించారు. ఏడాదిగా జీతం రాకపోవడంతో ఇంట్లో తినడానికి ఇబ్బందులు పడుతున్నామని, మందులు ఖర్చులకు కూడా అప్పులు చేసుకుని కొనుకుంటున్నామని కన్నీరుపెట్టారు. పై అధికారులకు తెలియజేసినా ఇంత వరకు ఎవరూ పట్టించుకోలేదని, మరో నెల రోజుల్లో తాను రిటైర్‌మెంట్ అయిపోతున్నా సరే పై అధికారులు కనికరించలేదని ఆవేదన చెందారు. ఇప్పటికైనా నా సబ్ రిజిస్ట్రార్‌తో పాటు తమ పై అధికారులు స్పందించి జీతం మంజూరు చేయాలని సుందరం కోరారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ పురుషోత్తమ్‌ను సంప్రదించగా సీనియర్ అసిస్టెంట్ సుందరంకు జీతం అందకపోవడం వాస్తవమేనని, జీతం రాకపోవడానికి తాను కారణం కాదన్నారు. తనకు యాక్సిడెంట్ జరిగి ఆస్పత్రిలో ఉండడం వల్ల మూడు నెలలు సెలవుపై వెళ్లినపుడు సీనియర్ అసిస్టెంట్ సుందరంకే ఇన్‌చార్జి ఇచ్చారని, అప్పట్లో అతను జీతం తీసుకోలేకపోయారన్నారు. తాను వచ్చేసరికి ఆయన పేరు సీఐఎఫ్ఎంఎస్ లో లేకపోవడంతో ఈ సమస్య వచ్చిందన్నారు. తాను మళ్లీ డూటీలో చేరిన తర్వాత ఈ విషయమై పలుసార్లు దరఖాస్తు రూపంలో పై అధికారులకు తెలిజేశామని, అతనికి జీతం రావడానికి తాను కూడా కృషి చేస్తున్నానన్నారు.

16వ తేదీ వరకూ రహదారి భద్రతా మాసోత్సవాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : రహదారి భద్రత ప్రమాణాల పట్ల అవగాహన, ఆచరణతోనే జిల్లాలో రహదారి ప్రమాదాలను నియంత్రించవచ్చుని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. తమ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రహదారి భద్రత మాసోత్సవాలను జనవరి 16 నుంచి ఫిబ్రవరి 16 వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పలు ప్రాంతాల్లో వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని చైతన్యపరచడం జరుగుతుందన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాపాయం తప్పుతుందని, అలాగే గాలి, దుమ్ము నుంచి రక్షిస్తుందని అన్నారు. ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించడం జరుగుతుందని, వాహన తనిఖీల చేపట్టి ప్రజలకు, వాహనదారులకు రహదారి భద్రత, మోటారు వాహన చట్టం గురించి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. 2024లో హెల్మెట్ ధరించని 67,054 మంది ద్విచక్ర వాహనదారులు, 4,388 మంది డ్రంక్ అండ్ డ్రైవ్, 12,318 ఓపెన్ డ్రింకింగ్ చేసిన వ్యక్తులపై చలానాలను విధించడం జరిగిందని ఆయన తెలిపారు.

హయ్యర్ పెన్షన్‌కు గ్రీన్ సిగ్నల్!

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త. రెండేళ్లుగా హయ్యర్ పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న వారి నిరీక్షణ ఫలించింది. హయ్యర్ పెన్షన్‌కు లైన్ క్లియర్ చేస్తూ ప్రావిడెంట్ ఫండ్ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో పెన్షనర్లు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు మొత్తం వేతనంపై పెన్షన్ చెల్లించాలంటూ 2014లో ఈపీఎస్-95 పెన్షనర్లకు సుప్రీంకోర్టులో కేసు వేశారు. విచారణ తర్వాత 2023లో పూర్తి వేతనంపై పెన్షన్ చెల్లించాలంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దాని ప్రకారం దేశవ్యాప్తంగా హయ్యర్ పెన్షన్ కోసం పీఎఫ్ అధికారులు డిమాండ్ నోటీసులు పంపారు. అందరిలానే స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 1800 మంది పెన్షనర్లు, ఉద్యోగులకు డిమాండ్ నోటీసులు పంపారు. వీరంతా హయ్యర్ పెన్షన్ కోసం తమ వాటా కింద రూ. 410 కోట్లు చెల్లించారు. ఈలోగా స్టీల్‌ప్లాంట్ ఎగ్జెంప్టెడ్ పీఎఫ్ ట్రస్ట్ హయ్యర్ పెన్షన్ నిబంధనలకు అనుగుణంగా లేవని విజయవాడ జోనల్ ప్రావిడెంట్ అధికారులు అడ్డుపుల్ల వేశారు. వారి నిర్ణయంతో హతాశులైన పెన్షనర్లు, ఉక్కు అధికారుల సంఘం నాయకులు, ఉద్యోగులు వాసా శ్రీనివాసమూర్తి, ద్వారం స్వామి, జె. అప్పలస్వామి, కుమారస్వామి, దుడ్డు శ్రీనివాస్, కె.వి.డి. ప్రసాద్ ప్రజాప్రతినిధులతో పాటు కేంద్ర పీఎఫ్ ట్రస్టీలు ఎం. జగదీశ్వరరావు, మల్లేశంను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా ఈ అంశంపై పీఎఫ్ అధికారులతో మాట్లాడారు. ఎట్టకేలకు బుధవారం విశాఖ రీజనల్ పీఎఫ్ అధికారుల నుంచి సానుకూలంగా సమాచారం అందింది. స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్ట్ నిబంధనలు హయ్యర్ పెన్షన్‌కు అనుగుణంగా ఉన్నాయని తెలిపారు. ఈనెలాఖరుకు ఇప్పటికే నగదు చెల్లించిన వారికి హయ్యర్ పెన్షన్ ప్రారంభం అయ్యే అవకాశం ఉందని ఉక్కు అధికారులు భావిస్తున్నారు.

పర్యాటక ప్రాంతంగా 'తాండవ'

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



తాండవ సభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నాతవరం: ఇటీవల కొత్తగా ఎన్నికైన తాండవ రిజర్వాయరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ ఆధ్వర్యంలో నీటి సంఘాల అభినందన సభ బుధవారం నాతవరంలో జరిగింది. ఈ సమావేశానికి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండవ రిజర్వాయర్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. పోలవరం కాలువ నీటిని తుని నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తాండవ ప్రాజెక్టులోకి తరలిస్తానన్నారు. దీనికి రూ.2,400 కోట్లు ఖర్చవుతుందని, నిధుల మంజూరుకు సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సొంత రాష్ట్రం గుజరాత్ కంటే మన రాష్ట్రంలో ఎక్కువ సామాజిక పింఛన్లు ఇస్తున్నామన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలతోపాటు, కమ్యూనిస్టు పార్టీ పాలనలో ఉన్న కేరళలో కూడా ఏపీకన్నా తక్కువ పింఛన్ ఇస్తున్నారని అన్నారు. నాతవరం-తాండవ రిజర్వాయర్ రోడ్డును, తాండవ-గొలుగొండ మండలం జోగుంపేట రోడ్డును ఆర్ అండ్ బీలో విలీనం చేస్తానన్నారు. తుని మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, తాండవ ప్రాజెక్టు వైస్ చైర్మన్ ఎం.జోగుబాబు, నాతవరం, కోటనందూరు, నర్సీపట్నం, కోటవురట్ల, గొలుగొండ మండలాలకు చెందిన నీటిసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కాఫీ కొనుగోలు ధరల సవరణ

మహారాణిపేట: గిరిజనుల వద్ద నుంచి సేకరిస్తున్న కాఫీ కొనుగోలు ధరలను గిరిజన సహకార సంస్థ (జీసీసీ) సవరించింది. పెరిగిన అంతర్జాతీయ కాఫీ ధరలు దృష్టిలో పెట్టుకుని కాఫీ అరబికా పార్చ్‌మెంట్ రకం, అరబికా చెర్రీ రకం ధరలను జీసీసీ పెంచింది. 2024-25 కాఫీ సీజన్‌కు సవరించిన ధరలకు అనుగుణంగా మిగిలిన మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేస్తామని జీసీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాఫీ కొనుగోలుకు సంబంధించిన ఫిర్యాదుల కోసం జీసీసీ కార్యాలయంలో 70130 70990 నంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. అరబికా పార్చ్‌మెంట్ రకానికి ప్రస్తుతం ఉన్న రూ.350 నుంచి రూ.400కు, అరబికా చెర్రీ రకానికి రూ. 230 నుంచి రూ.250కు పెంచామన్నారు. చింతపల్లి, జి.కె.వీధి ఇతర ప్రాంతాల్లో ఉన్న ఆర్గానిక్ సర్టిఫికేషన్ కలిగిన గ్రామాల నుంచి కొనుగోలు చేసిన కాఫీ ధరలను అధికంగా పెంచినట్టు ఆమె చెప్పారు.

బ్యాంక్‌పై దాడి కేసులో నిందితులు అరెస్ట్

నర్సీపట్నం : నర్సీపట్నంలో కలకలం సృష్టించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఉద్యోగులపై దాడి కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బ్యాంక్ నర్సీపట్నం శాఖలో రోలుగుంట మండలం, జానకీరామపురం పీఏసీఎస్‌కు చెందిన సిబ్బంది పెట్రోల్‌తో బ్యాంక్‌లో విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. దీనిపై డీసీసీబీ నర్సీపట్నం బ్రాంచ్ మేనేజర్ నాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పీఏసీఎస్ సీఈవో బి.రామకృష్ణ, సొసైటీ గుమస్తా ఎం.దేముడుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బుధవారం వీరిద్దరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ గోవిందరావు తెలిపారు.

రెండు బండరాళ్ల లారీలు స్వాధీనం

- అధిక లోడు కారణంగా రూ.1.10 లక్షల జరిమానా



ట్రాఫిక్ పోలీసులు స్వాధీనపర్చుకున్న బండరాళ్ల లారీలు

యలమంచిలి రూరల్: నిర్ణీత లోడు కంటే అధిక లోడుతో బండరాళ్లను రవాణా చేస్తున్న రెండు లారీలను బుధవారం యలమంచిలి ట్రాఫిక్ పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. రాంబిల్లి నేవల్ ఆల్టర్‌నేటివ్ ఆపరేటింగ్ బేస్ (ఎన్ఏఓబీ) నిర్మాణ పనులకు లారీలతో పెద్ద బండరాళ్లను తరలిస్తున్న వాహనాలు ఓవర్ లోడ్ రవాణా చేస్తున్నట్టు అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీల్లో పట్టుబడిన రెండు లారీల్లో ఒక దానిలో 42 టన్నులు, మరో దానిలో 44 టన్నులు బరువు ఉన్నట్టు తేలింది. ఈ రెండు లారీల్లో కేవలం 30 టన్నుల బరువు రవాణాకు మాత్రమే అనుమతి ఉంది. దీంతో అధిక లోడు రవాణా చేస్తున్నట్టు నిర్ధారించుకున్న ట్రాఫిక్ ఎస్ఐ బి.రామకృష్ణ వాటిని అనకాపల్లి రవాణా శాఖ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు ఆ రెండు వాహనాల్లో ఒకదానికి రూ.50 వేలు, మరొకదానికి రూ.60 వేలు జరిమానా విధించినట్టు ఎస్ఐ రామకృష్ణ విలేకరులకు తెలిపారు.

బాక్సైట్ లారీల అడ్డగింత

- అడ్డుకున్న రెండు గ్రామాల సర్పంచ్‌లు, గ్రామస్తులు
- నాలుగు కిలోమీటర్ల మేర నిలిచిన 120 లారీలు



లారీలను అడ్డుకున్న సర్పంచ్‌లు రామునాయుడు, నందకిషోర్, స్థానికులు



అడ్డుకోవడంతో భారీగా నిలిచిపోయిన లారీలు

మాకవరపాలెం: బాక్సైట్ ముడి ఖనిజాన్ని తరలించే లారీలను మండలంలోని శెట్టిపాలెం, భీమబోయినపాలెం ప్రాంతాల్లో అడ్డుకున్నారు. రాచపల్లి వద్ద ఉన్న ఆన్‌రాక్ (పయినీర్) అల్యూమినియం రిఫైనరీకి విశాఖ పోర్టు నుంచి నిత్యం అధిక సంఖ్యలో లారీలు బాక్సైట్ ఖనిజాన్ని తరలిస్తున్నాయి. ముడి ఖనిజం ప్రాసెసింగ్ అనంతరం వచ్చిన బాక్సైట్ పౌడర్‌ను తిరిగి పోర్టుకు తరలిస్తున్నాయి. అయితే పరిమితికి మించి లోడుతో లారీలు తిరుగుతున్నాయని, ఈ కారణంగా రోడ్లు పాడవుతున్నాయని ఆరోపిస్తూ బుధవారం తెల్లవారుజాము నుంచి శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు, భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిషోర్ ఆధ్వర్యంలో స్థానికులు లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల రద్దీతో ఇటీవల రోడ్డు ప్రమాదాలతోపాటు దొంగతనాలు అధికమయ్యాయన్నారు. పరిమితికి మించి లోడుతో లారీల రాకపోకలతో రోడ్లు సైతం అధ్వానంగా మారుతున్నాయన్నారు. శెట్టిపాలెం, భీమబోయినపాలెం, వెంకన్నపాలెం గ్రామాల పరిధిలో ఇటీవల వరుసగా 25 వరకు ప్రమాదాలు జరిగాయన్నారు. ఈ లారీల కారణంగా రెండు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారన్నారు. అందుకే భారీ వాహనాలను ఇకపై ఈ రోడ్లపై తిరగనివ్వమని స్పష్టం చేశారు. కంపెనీ యాజమాన్యం ప్రత్యామ్నాయం చూసుకోవాలన్నారు. ఒక్క లారీని కూడా తిరగనివ్వకపోవడంతో వెంకన్నపాలెం నుంచి భీమబోయినపాలెం వరకు సుమారు నాలుగు కిలోమీటర్లమేర 120 వరకు లారీలు నిలిచిపోయాయి. ఇదిలాఉండగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

7, 8 తేదీల్లో తోడపెద్దుల ఊరేగింపు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్‌: స్థానిక గవరపాలెం పెదరామ స్వామి దేవస్థానం ఆవరణలో ఈ నెల 7,8 తేదీల్లో తోడుపెద్దు, పాలకొలువు కార్యక్రమా న్ని నిర్వహించనున్నట్టు డైట్‌ కళాశాల చైర్మన్‌ దాడి రత్నాకర్‌ తెలిపారు. దేవస్థానం ఆవరణలో బుధవారం పెదరామ తోడుపెద్దు సేవా సంఘం, ఆడారి నూకయ్య సేవా గరిడి సంఘం ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 42 తోడు పెద్దులను ఈ కార్యక్రమానికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పట్టణ వీధు ల్లో తోడపెద్దులతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు పాలకొలువు దాసుడు, ఆడారి నాగభూషణం, బొడ్డేడ శంకర్రావు, కొరిబిల్లి ఆరుద్ర, పెంటకోట జగన్‌, తదితరులు పాల్గొన్నారు.

30 మద్యం బాటిళ్ల స్వాధీనం

కశింకోట: కశింకోట గవరపేటలోని ఓ పాన్‌ షాపులో 30 మద్యం బాటిళ్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ సూర్యారావు తెలిపారు. స్థానిక గవరపేటకు చెందిన మద్దాల నూకరాజు 30 కేరళ మద్యం కలిగి ఉండగా.. పట్టుకొని అరెస్టు చేశామన్నారు.

బాలికలకు విద్యా సామగ్రి పంపిణీ


కశింకోట బాల సదనంలో మాట్లాడుతున్న నోబుల్‌ చారిటీస్‌ అధ్యక్షురాలు విజయలక్ష్మి

కశింకోట: కశింకోటలోని బాల సదనంలో బాలికలకు నోబుల్‌ చారిటీస్‌ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నోట్‌ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను వితరణ చేశారు. సంస్థ అధ్యక్షురాలు ఎస్‌.విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికలు చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సంస్థ యోగా ఉపాధ్యాయురాలు ఎ.దేవి బాలికలకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్‌.నూకరాజు, ప్రతినిధులు నూకరత్నం, సంధ్య, పద్మావతి, నాగలక్ష్మి, రమణమ్మ, పైడితల్లి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పైలట్‌ సర్వేపై శిక్షణ

రోలుగుంట : స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో తహసీల్దార్‌ సీహెచ్‌.నాగమ్మ బుధవారం భూసర్వేపై సర్వేపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యాలయన్ని బుధవారం రాత్రి సందర్శించిన నర్సీపట్నం ఆర్డీవో భూముల సర్వేపై శిక్షణ ఇచ్చారు. మదర్‌ రికార్డులో భూవివరాలను పరిశీలించాలన్నారు. వన్‌ బి, ఎఫ్‌ఎంబీ, తదితర రికార్డులు పరిశీలన, విధుల నిర్వహణపై అవసరమైన శిక్షణ ఇచ్చారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 8,570 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్‌ రకం	3,800	4,780
మొదటి రకం	3,410	4.100
రెండో రకం	3,080	3,580
మూడో రకం	2,800	3,060

అనకాపల్లి సినిమాలు

దాకు మహారాజ్‌	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్‌-1
ప్రేమిస్తావా	:సత్యనారాయణ స్క్రీన్‌-2
మదగజరాజ	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
పట్టుదల	:వెంకటేశ్వర
గేమ్‌ ఛేంజర్‌	:శ్రీసత్య
మహేష్‌	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్‌ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 105 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్‌-12 యూనిట్లు, బీ పాజిటివ్‌-36 యూనిట్లు, ఓ పాజిటివ్‌-52 యూనిట్లు, ఏబీ పాజిటివ్‌-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌ బ్యాంకు టెక్నీషియన్‌ య.లోకేష్‌ను ఫోన్‌ నంబర్‌ 9703619706లో సంప్రదించవచ్చు.

గ్యాస్‌ సమాచారం

అనకాపల్లి: ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ ద్వారా బుధవారం 421 మంది గ్యాస్‌ బుక్‌ చేసుకున్నారు. గతంలో బుక్‌ చేసుకున్న వారిలో 389 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

అధ్వాన రహదారితో అవస్థలు


వెదురుపర్తి-పెదపాడు మార్గంలో పాలాల మీదుగా ఉన్న ఇరుకు రోడ్డు

- గోతలమయంగా వెదురుపర్తి-పెదపాడు మార్గం
- తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని ప్రజల విజ్ఞప్తి


గోతులతో నిండి ఉన్న రహదారి

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామం నుంచి పెదపాడు వైపు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. అడుగడుగునా పెద్దపెద్ద గోతులు దర్శనమివ్వడంతో రాకపోకలకు నిత్యం ప్రజలు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కశింకోట నుంచి వయా పెదపాడు, మునగపాక వెళ్లే గ్రామీణ సడక్‌ యోజనలో నిర్మించిన తారు రోడ్డుకు వెదురుపర్తి నుంచి పొలాల మీదుగా వెళ్లే మట్టి రహదారి కలిపి ఉంది. మట్టి రోడ్డుగా సుమారు కిలోమీటరు దూరం ఉన్న దీనిని దాదాపు రెండేళ్ల క్రితం అప్పటి వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వ హయాంలో మెటల్‌ రోడ్డుగా రూ.2 లక్షల పంచాయతీ నిధులను ఖర్చు చేసి తాత్కాలికంగా అభివృద్ధి చేశారు. దీన్ని తారు రోడ్డుగా అభివృద్ధి చేయడానికి అప్పట్లో ప్రయత్నాలు జరిగాయి. అయితే ఆ తర్వాత అవి ముందుకు సాగలేదు. వెదురుపర్తి గ్రామస్తులకు ఈ రహదారి మీదుగా దగ్గరి దారి కావడం వల్ల మునగపాక, అచ్యుతాపురం మండలాలకు చెందిన కాశీపాలెం, అరబుపాలెం, పెదపాడు, తిమ్మరాజుపేట, అచ్యుతాపురం తదితర గ్రామాలకు రాకపోకలు సాగించడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. అచ్యుతాపురం సెజ్‌లోని పరిశ్రమల్లో పని చేసే ఈ ప్రాంత ఉద్యోగులు, కార్మికులు రాకపోకలు సాగించడానికి కూడా దూరం తగ్గుతుంది. ఈ రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో వెదురుపర్తి నుంచి కశింకోట వద్ద ఉన్న కాశీ మదుం గ్రోయిన్‌ పక్కగా ఉన్న రోడ్డు మీదుగా చుట్టూ తిరిగి పెదపాడు రోడ్డుకు వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల సుమారు ఐదు కిలోమీటర్ల దూరం పెరుగుతుంది. అదే దగ్గరి మార్గంగా పొలాల మీదుగా ఉన్న రహదారిని అభివృద్ధి చేస్తే దూరం తగ్గుతుంది. పైగా ఈ రహదారిలో రెండు వైపులా వ్యవసాయ భూములు ఉన్నాయి. వాటిలో పండిస్తున్న వరి, చెరకు ఉత్పత్తులను తమ ఇళ్లు, మార్కెట్‌కు తరలించడానికి రైతులకు అనువుగా ఉంటుంది. వర్షా కాలంతో ఈ రోడ్డులో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకుంటోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలి



వెదురుపర్తి-పెదపాడు రోడ్డు గోతులతో నిండిపోయి అధ్వానంగా తయారైంది. మునగపాక, అచ్యుతాపురం మండలాల్లోని గ్రామాలకు రాకపోకలు సాగించడానికి చాలా దగ్గరి మార్గం. ఇది గోతులతో నిండి ఉండటంతో కాశీమదుం మీదుగా సుమారు 5 కిలోమీటర్ల దూరం వెళ్లి పెదపాడు రోడ్డు వైపు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీన్ని తారు రోడ్డుగా అభివృద్ధి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆళ్ల జగదీష్‌, వెదురుపర్తి

వర్షం పడితే మరిన్ని అవస్థలు



వెదురుపర్తి-పెదపాడు రోడ్డు గోతులమయం కావడంతో వ్యవసాయ కార్యకలాపాలు సాగించడానికి, ఉత్పత్తులను తరలించడానికి ఇబ్బందవుతోంది. వర్షం వస్తే రోడ్డుపై రాకపోకలు సాగించడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఈ రోడ్డు పెదపాడు వైపు మునగపాక, అచ్యుతాపురం మండలాల గ్రామాలకు రాకపోకలు సాగించడానికి దగ్గరి మార్గం కూడా. దీని దృష్ట్యా ఈ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఆదారి వెంకటరావు, రైతు, వెదురుపర్తి

‘తుమ్మపాల సుగర్‌ ఫ్యాక్టరీ అమ్మకం సరికాదు’


తుమ్మపాల సుగర్‌ ఫ్యాక్టరీ సమస్యలపై మాట్లాడుతున్న విల్లూరి పైడారావు

తుమ్మపాల: తుమ్మపాల వీవీ రమణ సుగర్‌ ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టడం పద్ధతి కాదని వీవీ రమణ సుగర్‌ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ కన్వీనర్‌ విల్లూరి పైడారావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌ కల్యాణ్‌, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు చేతులెత్తేయడం అన్యాయమన్నారు. సంఘం నాయకుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ ఫ్యాక్టరీని అమ్మాలని చూస్తున్న వ్యక్తినే ఈ ఫ్యాక్టరీకి ఎండీగా నియమించడం దారుణమన్నారు. ఫ్యాక్టరీ షేర్‌ హోల్డర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యుడు గొర్లె మోదు నాయుడు మాట్లాడుతూ దివంగత మాజీ రాజ్యసభ సభ్యుడు వీవీ రమణ ఏ ఆశయాలతో ఫ్యాక్టరీని స్థాపించారో ఆ ఆశయాలను కొనసాగించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు నాయకులు పీలా సీతారాం, కొరిబిల్లి శంకరరావు, కాళ్ల తేలయ్యబాబు, గండి నాయినిబాబు, పెంటకోట జగన్నాథరావు, బుద్ధ రంగారావు పాల్గొన్నారు.

రోడ్డును తవ్వేసిన రామాపురం కూటమి నాయకులు

గ్రామాల మధ్య చిచ్చుకు ప్రయత్నం


రాకపోకలు జరగకుండా రోడ్డును తవ్వేసిన దృశ్యం

తుమ్మపాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీల నాయకులు ఒక్కో గ్రామంలో ఒక్కోలా వ్యవహరిస్తున్నారు. మామ్ముళ్ల కోసం కాలుష్యం పేరుతో రోడ్లపై తిరిగే లారీలు నిలిపివేయడం, రోడ్లను తవ్వేయడం వంటి చర్యలు నిత్యకృత్యంగా మారింది. మండలంలో పిసినికాడ, కొత్తూరు పంచాయతీ రామాపురం గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రహదారిని మంగళవారం రాత్రి కూటమి నాయకులు పొక్లెయిన్‌తో తవ్వేసి రోడ్డుకు అడ్డంగా మట్టిదిబ్బలు వేయడంపై చర్చనీయాంశంగా మారింది. రామాపురం నుంచి పిసినికాడ సర్వే నంబర్‌ 43, 47/1 మీదుగా పూర్వం నుంచి రోడ్డు ఉంది. రామాపురం నుంచి ఉన్న రహదారి ఆధారంగా పిసినికాడ రెవెన్యూ పరిధిలో కొందరు తమ భూములను విక్రయించుకోవడం చూడలేని కూటమి నాయకులు రోడ్డును అడ్డుకునే ప్రయత్నం రెండేళ్లుగా చేస్తున్నారు. దీంతో ఆరు గ్రామాల ప్రజల మధ్య ఘర్షణ జరగడంతో కోర్టు ఆదేశాలతో రోడ్డును యథావిధిగా కొనసాగిస్తున్నారు. రోడ్డును అడ్డుకున్న వారిపై పోలీస్‌ కేసులు కూడా నమోదవడంతో వారంతా కొన్ని రోజులుగా మిన్నకుండిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ రోడ్డును అడ్డుకోవడమే లక్ష్యంగా రామాపురం కూటమి నాయకులు వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ, పోలీసులు దృష్టి సారించి రోడ్డును యథావిధిగా కొనసాగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

8న గౌరమ్మ ఉత్సవం


కశింకోటలో మాట్లాడుతున్న గౌరమ్మ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

కశింకోట: స్థానిక డీపీఎన్‌ జెడ్పీ హైస్కూల్‌ వద్ద గౌరీ పరమేశ్వరుల(గౌరమ్మ) ఉత్సవాన్ని ఈ నెల 8న పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు వేగి గోపీకృష్ణ, వేగి దొరబాబు, ఆదారి నరసింగరావు తెలిపారు. కశింకోటలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముందుగా ఈనెల 7న అమ్మవారి సారె ఊరేగింపు, 8న గౌరమ్మ ఉత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేల వేషాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో వేగి వెంకటరావు, కాండ్రేగుల సతీష్‌, పెంటకోట తాతారావు, వేగి సాయి, శిలపరశెట్టి మధు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాముహిక లక్ష తులసి నామార్చన


లక్ష తులసి నామార్చన పూజ అందుకున్న అమ్మవారు


కన్యకాపరమేశ్వరిని దర్శించుకుంటున్న కార్పొరేటర్లు మందపాటి సునీత జానకీరామరాజు, జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్‌ దంపతులు

అనకాపల్లి: స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ శతజయంతి ముగింపు ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం ప్రధాన అర్చకులు రాజేటి శ్రీరామాచార్యులు, రేజేటి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో సాముహిక లక్ష తులసి నామార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో విఘ్నేశ్వర పూజ, దంపతులతో సంకల్పం, పంచగవ్యప్రాసన, జనార్తన, స్వామివారికి నవకలశ స్నపనము, ద్వాదశ కాలార్చనలు, అష్టోత్తర శత సహస్ర నామార్చన, సూర్యనమస్కారాలు, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 4 గంటలకు సాముహిక లక్ష తులసి నామార్చనలు చేశారు. అమ్మవారిని 82, 83 వార్డుల కార్పొరేటర్లు మందపాటి సునీత జానకీరామరాజు, జాజుల ప్రసన్న లక్ష్మి రమేష్‌ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవ చైర్మన్‌ కోరుకొండ బుచ్చిరాజు మాట్లాడుతూ మూడో రోజైన గురువారం అమ్మవారి ఆలయంలో నగరేశ్వరస్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష బిల్వ నామార్చనలు, 108 మంది సుహాసినీల పూజ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవ కో చైర్మన్‌ డాక్టర్‌ గ్రంథి శేషుకుమార్‌, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్‌, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యురాలు వాణి జగదీశ్వరి, వైద్య సిబ్బంది

అనకాపల్లి: క్యాన్సర్‌ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు ఎన్‌.వాణీజగదీశ్వరి అన్నారు. మండలంలో తుమ్మపాల పీహెచ్‌సీలో లెప్రసీ, క్యాన్సర్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు ఉన్నా, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, కనురెప్పలు మూతపడకపోతున్నా, కాళ్లకి చెప్పులు జారిపోతున్నా, చేతి, కాళ్ల వేళ్లు వంకరలు తిరిగి ఉన్నట్లయితే దగ్గలో ఉన్న వైద్యులను సంప్రదించాలన్నారు. మానవుని జీవనశైలీలో అనేక మార్పులే క్యాన్సర్‌కు కారణమవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బత్తుల మంగమ్మ, బి.సంఘం, మాధవి, ఆశ వర్కర్స్‌, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్‌ కార్యక్రమం


తాళ్లపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్‌ సీడీపీవో ప్రభావతి

కశింకోట: పోషకాహార లోపం, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్‌ సీడీపీవో పి.ప్రభావతి అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. తాళ్లపాలెంలో 3వ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్‌ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు పోషకాహార లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 18 ఏళ్లలోపు కిషోర్‌ బాలికలు క్యాన్సర్‌ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, వైద్య సలహాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పడాల బొర్రమ్మ, పిల్లలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఏటికొప్పాక బొమ్మల శకటం రూపకర్తలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్‌ బత్తుల నోబుల్‌కుమార్‌, తదితరులు

కశింకోట: దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకలో తృతీయ స్థానంతో జ్యూరీ పురస్కారం పొందిన ఏటికొప్పాక బొమ్మల శకటం ప్రదర్శనకు ప్రాతినిధ్యం వహించి తిరిగి వచ్చిన కశింకోట సెయింట్‌ జాన్స్‌ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ మేరకు స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్‌ బత్తుల అనూరాధ మాట్లాడుతూ రాష్ట్రం నుంచి 16 మంది విద్యార్థులు ఏటికొప్పాక బొమ్మల శకట ప్రదర్శనలో ప్రాతినిధ్యం వహించగా, వారిలో సెయింట్‌ జాన్స్‌కు చెందిన సిహెచ్‌.మహిదీప్‌(7వ తరగతి), డి.యజ్విన్‌ శ్రీదేవ్‌, పి.సాయిసుమిత్‌, జి.బాలాదిత్య, పి.ఎస్‌.ఎస్‌.ఎస్‌.సూర్యప్రకాష్‌, సీహెచ్‌.శంకర్‌శ్రీ నారాయణ, సిహెచ్‌.సాత్విక్‌(8వ తరగతి) ఉండడం ఎంతో గర్వకారణమన్నారు. వారికి స్కూల్‌ డైరెక్టర్‌ బత్తుల నోబుల్‌కుమార్‌ ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులకు తోడ్పాటుగా నిలిచిన ఉపాధ్యాయులు హేమసాయి, వై.సంతోషిలను అభినందించారు. తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. స్కూలు ప్రిన్సిపాల్‌ రూపనంది, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లేబర్‌ కోడ్‌ చట్టాలపై నిరసన బాట


లేబర్‌ కోడ్స్‌ రద్దు చేయాలంటూ నిరసన తెలుపుతున్న కార్మికులు


లేబర్‌ కోడ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

తుమ్మపాల: కేంద్రం ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్‌ కోడ్స్‌ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ కార్మికులు నిరసన బాట పట్టారు. దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్‌ కార్యాలయం నుంచి ఎన్టీఆర్‌ స్టేడియం, నాలుగు రోడ్ల వరకు కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వ మద్యం గిడ్డంగి కార్మికులు శంకరం వద్ద రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే విధంగా నాలుగు లేబర్‌ కోడ్‌ చట్టాలను బీజేపీ ప్రభుత్వం 2023లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పటికీ కార్మిక సంఘాల పోరాటంతో ఇప్పటి వరకు అమలు చేయలేకపోయిందన్నారు. కార్మికులపై కక్ష్య కట్టిన బీజేపీ ప్రభుత్వం రానున్న ఏప్రిల్‌ నుంచి అమలు చేయాలని చూస్తుందన్నారు. లేబర్‌ కోడ్స్‌ అమలుతో భవిష్యత్తులో కార్మికులకు ఎటువంటి హక్కులు అమలు కావని, కనీస వేతనాలు చట్టం, ఈఎస్‌ఐ, పీఎఫ్‌, గ్రాట్యుటీ వంటి సౌకర్యాలు దక్కకుండా పోతాయన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌.దొరబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్‌.శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో కార్మికులకు, ప్రజలకు ఎటువంటి కేటాయింపులు లేవన్నారు. ఉపాధి హామీకి నిధులు తగ్గించారని, వ్యవసాయ రంగానికి నిధులు కోత పెట్టారని, నిరుద్యోగులకు మొండి చేయి చూపారని, ఐసీడీఎస్‌కి నిధులు తగ్గించడంతో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందకుండా పోతుందని ఆరోపించారు. ఏప్రిల్‌ నుంచి లేబర్‌ కోడ్స్‌ అమలు చేస్తే కార్మికులందరూ సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, సీఐటీయూ ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు దాకారపు శ్రీనివాసరావు, అజయ్‌, ఓమ్మి అప్పారావు, బి.రాము, వై.శివ, రాజు, భారతి, భాస్కర్‌, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు డిగ్రీ ఫస్ట్‌ సెమిస్టర్‌ ఫలితాలు

యలమంచిలి రూరల్‌: స్వయం ప్రతిపత్తి హోదా దక్కిన తర్వాత యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత నెలలో నిర్వహించిన డిగ్రీ మొదటి సెమిస్టర్‌ పరీక్ష ఫలితాలు గురువారం విడుదల చేయనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.చంద్రశేఖర్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 2 నుంచి 9వ తేదీ వరకు బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులు చదువుతున్న సుమారు 311 మంది విద్యార్థులకు అటానమస్‌ హోదాలో మొదటి సెమిస్టర్‌ థియరీ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల నియంత్రణ అధికారి పర్యవేక్షణలో జవాబు పత్రాల మూల్యాంకనం అనంతరం ఫలితాలు సిద్ధం చేశారు. ఈ ఫలితాలను కళాశాల ఐక్యూఏసీ విభాగంలో గురువారం ఉదయం 11 గంటలకు విడుదల చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

పాయకరావుపేట: పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు అన్నారు. మండలంలోని పెదరాంభద్రపురం, రాజానగరం గ్రామాల్లో 10వ తరగతి విద్యార్థులకు శత శాతం ఉత్తీర్ణత సాధన ప్రణాళికలో భాగంగా ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న స్టడీ సెంటర్లను బుధవారం ఆయన సందర్శించారు. దీనిలో భాగంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పరీక్షలు ముగిసే వరకు టీవీలకు, సెల్‌ ఫోన్‌లకు దూరంగా ఉంచాలని, ఇంటిలో చక్కగా చదువుకునేలా సానుకూల పరిస్థితులు కల్పించాలని, మంచి పోషకాహారం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు, షేక్‌ కోదండరాం రహీమ్‌, మండల విద్యాశాఖాధికారి-2 జి.రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌ పిట్టా గణేష్‌, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో కార్మిక చట్టాలు అమలు చేయాలి


సమస్యలను డీసీహెచ్‌వో శ్రీనివాస్‌కు వివరిస్తున్న కార్మికులు

తుమ్మపాల: జిల్లా, ఏరియా, సామాజిక ఆస్పత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్యం, భద్రతా విభాగం, చెద పురుగుల నివారణలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం, కార్మిక చట్టాలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్‌ మెడికల్‌ కాంట్రాక్ట్‌ ఎంప్లాయిస్‌ వర్కర్స్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్‌ చేశారు. కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం స్థానిక ఎన్టీఆర్‌ ఆసుపత్రిలో డీసీహెచ్‌ అధికారి శ్రీనివాస్‌ కాంట్రాక్టర్లు, కార్మికులను చర్చలకు పిలుపు చేయగా కాంట్రాక్టర్లు గౌర్హాజరయ్యారు. కార్మికులకు కనీస వేతనం, కార్మిక చట్టాలు అమలు చేయలేని కాంట్రాక్టర్లను తక్షణమే బ్లాక్‌ లిస్టులో పెట్టాలన్నారు. లేని క్రమంలో భవిష్యత్‌ పోరాటాలకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు అరుణ్‌ కుమార్‌, ఎస్‌.సంతోష్‌, పోలారావు, నూకరాజు, నక్కా కావమ్మ, నాగరత్నం, సత్యవతి, వరప్రసాద్‌, అడవి రాజు, అనిల్‌ కుమార్‌, వెంకటలక్ష్మి, వినోద్‌ కుమార్‌, వివిధ హాస్పిటల్‌ కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్‌ స్తంభాన్ని ఢీ కొన్న కారు


చెరువులోకి దూసుకుపోయిన కారుపై పడ్డ విద్యుత్‌ స్తంభం

బుచ్చెయ్యపేట : మండలంలో కశింకోట,బంగారుమెట్ట(కేబి) ఆర్‌అండ్‌బీ రోడ్డులో పెద్ద ప్రమాదం తప్పింది. బుధవారం సాయంత్రం వడ్డాది నుంచి అనకాపల్లి వైపు వేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కనున్న విద్యుత్‌ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో కారు పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న చెరువులోకి దూసుకుపోయింది. చెరువులోకి దూసుకుపోయిన కారుపైనే విరిగిన విద్యుత్‌ స్తంభం పడింది. సినీ ఫక్కీలో జరిగిన ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. కారులో ఉన్న నలుగురు వ్యక్తులు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. చెరువులో నీరు లేదు. అలాగే కొత్తగా వేస్తున్న విద్యుత్‌లైన్‌ అవడంతో విద్యుత్‌ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.